క్లుప్తంగా

ముదిరాజ్‌లకు కమ్యూనిటీ హాల్ నిర్మిస్తా

● ఎమ్మెల్యే సామేల్



ఎమ్మెల్యే సామేల్ ను సన్మానిస్తున్న నాయకులు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని తిమ్మాపురంలో ముదిరాజ్‌లకు కమ్యూనిటీ హాల్ నిర్మిస్తానని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ హామీ ఇచ్చారు. సోమవారం ముదిరాజ్‌సంఘం నాయకులు తిరుమలగిరిలో ఎమ్మెల్యే సామేల్‌ను కలిసి ముదిరాజ్ సంఘ భవనం నిర్మించాలని కోరారు. వెంటనే స్పందించినట్లు సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు జీడి వీరస్వామి, పాలెల్లి సురేష్, ఈదునూరి సంతోష్, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా విఠల్‌రెడ్డి





సంకెపల్లి విఠల్‌రెడ్డి బన్వరి నర్సయ్య

తిరుమలగిరి (తుంగతుర్తి) : రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం తిరుమలగిరి మండల నూతన కమిటీని సోమవారం స్థానిక పెన్షనర్స్ భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంకెపల్లి విఠల్‌రెడ్డి, కార్యదర్శిగా బన్వరి నర్సయ్య, కోశాధికారిగా సీహెచ్.పుల్లయ్య, అసోసియేట్ అధ్యక్షుడిగా మల్లయ్య, ఉపాధ్యక్షుడిగా సత్తిరెడ్డి, మహిళా అధ్యక్షురాలిగా పద్మమ్మ, జాయింట్ సెక్రటరీగా కొమురెల్లి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాములు, పబ్లిసిటీ సెక్రటరీగా రామిరెడ్డి, జిల్లా కౌన్సిలర్లుగా కృష్ణమాచారి, విద్యాసాగర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీతారామయ్య, ఎన్నికల అధికారి నాగిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రాంబాబు, లక్ష్మీకాంత రెడ్డి హాజరయ్యారు.

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా శ్రీనివాస్‌రావు



టేకుపల్లి శ్రీనివాస్‌రావు

చివ్వెంల(సూర్యాపేట) : సూర్యాపేట మున్సిపాలిటీ స్టాండింగ్ కౌన్సిల్‌గా సూర్యాపేటకు చెందిన సీనియర్ న్యాయవాది టేకుపల్లి శ్రీనివాస్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర న్యాయ సేవా కార్యదర్శి బి. పాపిరెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మూడేళ్ల పాటు ఆయన ఈ స్టాండింగ్ కౌన్సిల్‌గా కొనసాగనున్నారు. ఈ సందర్భంగా సూర్యాపేట బార్ అసోషియేషన్ కొంపల్లి లింగయ్య, ప్రధాన కార్యదర్శి సుంకరబోయినరాజులతో పాటు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.


మృతురాలి కుటుంబానికి పరామర్శ

చివ్వెంల(సూర్యాపేట) : మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పబ్బు సైదులు తల్లి పిచ్చమ్మ (65) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందింది. మృతదేహాన్ని పలువురు నాయకులు సందర్శించి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావతు వీరన్న నాయక్, యల్కపల్లి వెంకన్న, గోగుల ఈదయ్య, గోగుల శ్రీను, యల్కపల్లి సుధాకర్, గుగులోతు నాగు నాయక్ పాల్గొన్నారు.

సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా సాయికుమార్

నాగారం : తుంగతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా నాగారం గ్రామానికి చెందిన కొలిపాక సాయికుమార్ నియమితులయ్యారు. ఈమేరకు ఆయనకు సోమవారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు నియామకపత్రం అందజేశారు.

భవిత కేంద్రం భవనాల నిర్మాణ పనులు ప్రారంభం



అర్వపల్లిలోని ఎమ్మార్సీ ఆవరణలో భవిత కేంద్ర నిర్మాణ పనులు చేపడుతున్న దృశ్యం

అర్వపల్లి : అర్వపల్లి, నాగారంలో భవిత కేంద్రం భవనాల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఒక్కో మండలంలో రూ.9.50 లక్షలతో భవనాలను నిర్మిస్తున్నారు. అర్వపల్లిలో పిల్లర్ల నిర్మాణం, రాతి పనులు చేపడుతున్నారు. మద్దిరాల, నూతనకల్ మండలాల్లో పనులు మొదలు కావాల్సి ఉంది. త్వరితగతిన భవనాల నిర్మాణం చేపట్టనున్నట్లు టీజీఈడబ్ల్యూఐడీసీ ఏఈ రంగారావు తెలిపారు.

దుర్గామాత నవరాత్రోత్సవాలు ప్రారంభం

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండలంలోని వివిధ గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మండపాల్లో దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటిరోజు అమ్మవారు బాలాత్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చారు.

అర్వపల్లి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో 25 దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు. దుర్గాదేవి మొదటి రోజు బాలాత్రిపుర సుందరీ దేవి అవతారంలో దర్శనమిచ్చారు.

పెన్‌పహాడ్ : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో సోమవారం దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గామాత మొదటి రోజు బాలత్రిపుర సుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



అర్వపల్లి: బొల్లంపల్లిలో భవానీ మాలధారుల పూజలు

నూతనకల్ : దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం దుర్గామాత విగ్రహాలను భక్తులు ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, పాల్గొన్నారు.

మద్దిరాల : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం దుర్గామాత శ్రీ బాలాత్రిపుర సుందరీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. కుక్కడం గ్రామంలో తుంగతుర్తి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కోడి శ్రీనివాస్ యాదవ్-హేమలత దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు చామకూరి లింగయ్య, కాశీం, చిరంజీవి,సతీష్, మహేష్, యాకస్వామి, నరేష్, నర్సయ్య పాల్గొన్నారు.



తిరుమలగిరి : పూజలు చేస్తున్న భక్తులు



పెన్‌పహాడ్ : అనంతారంలో దుర్గాదేవికి పూజలు చేస్తున్న భక్తులు

ఉద్యోగం నుంచి తొలగించాలని ఫిర్యాదు

భానుపురి (సూర్యాపేట) : తప్పుడు కుల ధ్రువీకరణ పత్రంతో సూర్యాపేట జనరల్ ఆస్పత్రిలో స్టాఫ్ నర్స్‌గా పనిచేస్తున్న కనకం అశ్విని అలియాస్ అస్మా సుల్తానాను ఉద్యోగం నుంచి తొలగించాలని కోరుతూ ఆమె భర్త షేక్ రసూల్ గ్రీవెన్స్‌డే లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగారం మండలం పసునూరు గ్రామానికి చెందిన కనకం అశ్విని 2015వ సంవత్సరంలో మహబూబాబాద్ జిల్లా తొర్రూరు గ్రామానికి చెందిన తనను మతం మార్చుకుని వక్ఫ్ బోర్డు కార్యాలయంలో వివాహం చేసుకుని ముస్లిం చట్టాల ప్రకారం సర్టిఫికెట్లు పొందిందన్నారు. 2023 లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్టాఫ్ నర్స్ నోటిఫికేషన్‌కు తన కులాన్ని బీసీ ఈగా చూపించకుండా ఎస్సీ మాలగా తప్పుడు పత్రాలు చూపించి అక్రమంగా ఉద్యోగం పొందిందన్నారు. ఈ విషయమై అధికారులు సమగ్రమైన విచారణ చేపట్టి ఆమెపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు.



గ్రీవెన్స్ డే లో అధికారులకు వినతి పత్రం అందిస్తున్న షేక్ రసూల్

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

భానుపురి (సూర్యాపేట) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సూర్యాపేట కార్యాలయంలో ఈ నెల 24వ తేదీన సూర్యాపేటకు చెందిన శ్రీకంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు దండ శ్యాంసుందర్ రెడ్డి, సుదగాని నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే వైద్య పరీక్షలకు పెన్షనర్లు, ప్రభుత్వ రెగ్యులర్ ఉద్యోగులు, జర్నలిస్టులు, ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నవారు హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆడపడుచులందరికీ బతకమ్మ చీరలు ఇవ్వాలి

సూర్యాపేట అర్బన్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా ఇందిరమ్మ మహిళా శక్తి పథకం ద్వారా పంపిణీ చేసే చీరలను తెలంగాణలోని ఆడపడుచులందరికీ ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదిర్శ మట్టిపల్లి అన్నారు. సోమవారం స్థానిక మల్లు వెంటకనర్సింహారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో డ్వాక్రా గ్రూపులలో ఉన్న 65 లక్షల మంది మహిళలకు మాత్రమే చీరల పంపిణీ చేస్తామని చెప్పడం సిగ్గు చేటు అన్నారు. డ్వాక్రా గ్రూపుల్లో ఉన్నవారు మాత్రమే మహిళలనేనా.. మిగతవారు మహిళలు కాదా అని ప్రశ్నించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పులుసు సత్యం, జిల్లా సహాయ కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, మహిళా కూలీల జిల్లా కన్వీనర్ జంపాల స్వరాజ్యం పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు ప్రారంభం



తిరుమలగిరిలో శతాబ్ది వేడుకల్లో పాల్గొన్న స్వయం సేవకులు

తిరుమలగిరి(తుంగతుర్తి) : తిరుమలగిరి మున్సిపాలిటీలో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మెంత మధుసూదన్ పాల్గొని మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించి వచ్చే విజయదశమి నాటికి వందేళ్లు పూర్తవుందని తెలిపారు. కావున దేశ వ్యాప్తంగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యారంగంలో, ప్రకృతి విపత్తుల సమయంలో, యుద్ధ సమయంలో, వైద్యరంగంలో ఆర్‌ఎస్‌ఎస్ సేవలను వివరించారు. దేశ ప్రజల్లో సమైక్యత, జాతీయ భావం, క్రమశిక్షణ పెంపొందించేందుకు ఆర్‌ఎస్‌ఎస్ దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో తిరుమలగిరి ఖండా కార్యవాహ ఝిలసోజు అశోక్ భిక్షమాచారి, కత్తి వెంకటరెడ్డి, వై.దీన్‌దయాల్, సంతోష్ నాయక్, శ్రీరంగం, ఇమ్మడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సేవాలాల్ సేనా నాయకుల ముందస్తు అరెస్ట్

చివ్వెంల(సూర్యాపేట) : ఎస్టీల చలో హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న సేవాలాల్ సేనా పలువురు నాయకులను సోమవారం తెల్లవారుజామున ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే కుట్రలకు వ్యతిరేకంగా సేవాలాల్ సేనా వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవ్‌నాయక్ పిలుపు మేరకు హైదరాబాద్‌లో నిరసనకు వెళ్తున్నట్లు పలువురు నాయకులు తెలిపారు. అరెస్టయిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాం నాయక్, భుక్యా నాగు నాయక్, జిల్లా కార్యదర్శి పాల్గొన్నారు.



పోలీసుల అదుపులో సేవాలాల్ సేనా మండల నాయకులు

ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు

పెన్‌పహాడ్ : ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని నారాయణగూడెం, నాగులపహాడ్, అన్నారం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పేదలకు న్యాయం జరగలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణ ప్రవీణ్‌రెడ్డి, మండలి జ్యోతి, పిచ్చయ్య, ముత్తినేని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



నారాయణగూడెంలో ఇందిరమ్మ ఇంటికి శంకుస్థాపన చేస్తున్న తూముల సురేష్‌రావు

రైతులకు సోలార్ దీపపు ఎరల పంపిణీ

ఆత్మకూర్(ఎస్) : పంట మార్పిడి కింద నూనెగింజల సాగు చేయడం ద్వారా అధిక ఆదాయంతో పాటు ఆహార భద్రతను సాధించవచ్చని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డి.నరేష్, ఎ.కిరణ్ అన్నారు. సోమవారం ఆత్మకూర్.ఎస్ మండల పరిధిలోని తుమ్మల పెన్‌పహాడ్ గ్రామంలో శ్రీ అరవింద కృషి విజ్ఞాన కేంద్రం గడ్డిపల్లి ఆధ్వర్యంలో వేరుశనగ పంట సాగు చేసే రైతులకు జిగురు అట్టలు, వేపనూనె, సోలార్ దీపపు ఎరలను, పంపిణీ చేసి పంట సాగు పై అవగాహన కల్పించారు. వేరుశనగలో, కలుపు, నీటి యాజమాన్య, చీడపీడల యాజమాన్య పద్ధతులపై వివరించారు. వేరుశనగలో ఎరువుల యాజమాన్యం జిప్సం ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కేవికే శాస్త్రవేత్త జి.సంతోష్, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

ఎత్తిపోతలతో 45 వేల ఎకరాలకు నీరు

● మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు

మోతె : రూ. 244 కోట్ల వ్యయంతో నిర్మించనున్న పాలేరు ఎత్తిపోతల పథకం ద్వారా మోతె మండలంలో 45 వేల ఎకరాలకు పైగా సాగు నీరు అందుతుందని కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని భల్లుతండాలో అధికారులతో కలిసి లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎత్తిపోతల పథకంతో ఎస్సారెస్పీ ఎల్- 36, ఎల్-22 కెనాల్స్ ద్వారా మోతె మండలంలోని అన్ని గ్రామాలకు సాగు నీరు అందేలా మ్యాప్ డిజైన్ చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఈ శివధర్మతేజ, ఈఈ యాదగిరి, డీఈలు రమేష్, సుస్మిత, జేఈలు సురేష్, సుస్మిత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, నాయకులు మైనంపాటి గుర్వారెడ్డి, పుల్లారావు, ముదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న చందర్‌రావు

సామాజిక బాధ్యత కలిగి ఉండాలి : ఎస్పీ

సూర్యాపేటటౌన్ : డ్రగ్స్, గంజాయి నిర్మూలనలో ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ కె.నరసింహ అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు, సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్ డ్రగ్స్ నిర్మూలనకు చేపట్టిన బైక్ యాత్రను సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాగ్రత్తగా వాహనం నడుపుతూ గంజాయి నిర్మూలనపై ప్రజల్లో చైతన్యం కల్పించాలని, ప్రమాదాలకు దూరంగా ఉంటూ ప్రయాణించాలని ఆకాంక్షించారు. సెలవులను సద్వినియోగం చేసుకొని రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కల్పించడానికి ముందుకు వచ్చిన టీచర్ ప్రభాకర్‌ను అభినందించారు. ప్రస్తుత సమాజంలో గంజాయి, డ్రగ్స్ అత్యంత ప్రమాదకరంగా మారాయని, యువత దీని బారిన పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఇలాంటి గంజాయి, డ్రగ్స్ లాంటివి మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. ఉజ్వలమైన దృఢమైన భవిష్యత్‌ను నిర్మించుకోవాలని తెలిపారు. సామాజిక కార్యకర్త ప్రభుత్వ టీచర్ రాచకొండ ప్రభాకర్ మాట్లాడుతూ గంజాయి నిర్మూలన కోసం తన వంతు బాధ్యతగా ప్రజలకు చైతన్యం చేస్తున్నానని, దసరా సెలవులు రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కల్పించడానికి సద్వినియోగం చేసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవీందర్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, డీఎస్పీ ప్రసన్న కుమార్, ఆర్ఐ నారాయణ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, పోలీస్ సంఘం అధ్యక్షుడు రామచందర్ గౌడ్, ఆర్‌ఎస్‌ఐలు ఎం.అశోక్, సాయిరాం, కె.అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.



బైక్ యాత్రను ప్రారంభిస్తున్న ఎస్పీ నరసింహ

మలిదశ ఉద్యమకారుడు కృష్ణమూర్తి మృతి

● నివాళులర్పించిన ఎమ్మెల్యే సామేల్, పార్టీల నాయకులు
● కుటుంబానికి రూ.లక్ష సాయం

అర్వపల్లి : అర్వపల్లికి చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, సీనియర్ నాయకుడు దిర్శనపు కృష్ణమూర్తి (55) సోమవారం మృతి చెందారు. మూడు రోజుల కిందట రోడ్డు ప్రమాదానికి గురైన ఆయన చికిత్స పొందుతూ మరణించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె నవ్య తండ్రికి తలకొరివి పెట్టారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు కృష్ణమూర్తి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి, మృతుడి కుటుంబానికి రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. అంత్యక్రియల్లో కళాకారుడు ఏపూరి సోమన్న కళాబృందం ఆధ్వర్యంలో కృష్ణమూర్తిని స్మరిస్తూ పాటలు పాటారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల రమేష్, మాజీ సర్పంచ్ జీడి వీరస్వామి, తెలంగాణ ఉద్యమకారులు, వివిధ పార్టీల నాయకులు ఉన్నారు.



కృష్ణమూర్తి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సామేలు

ఎస్వీ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ వేడుకలు

సూర్యాపేటటౌన్ : పట్టణంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కెప్టెన్ డాక్టర్ వి. వెంకటేశులు, వైస్ ప్రిన్సిపాల్ ఎన్ఎస్ఆర్ శాస్త్రి, ఎన్ సి సి కోఆర్డినేటర్ నాగు నాయక్, ఎగ్జామినేషన్ కోఆర్డినేటర్ కవిత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు మధు తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు,చిత్రంలో అధ్యాపకులు

పుల్లారెడ్డి మృతి బాధాకరం

సూర్యాపేట అర్బన్ : సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వైద్యులు కెప్టెన్ ఎన్. పుల్లారెడ్డి ఆదివారం రాత్రి మృతిచెందారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్, బీజేపీ రాష్ట్ర నాయకులు జుట్టు కొండ సత్యనారాయణ డాక్టర్ మృతదైహం పై పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కెప్టెన్ డాక్టర్ ఎన్ పుల్లారెడ్డి ఆర్మీలో విశేష సేవలు అందించారని కొనియాడారు. 1987 నుంచి పట్టణంలో ఉంటూ సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా కూడా పనిచేశారని గుర్తు చేశారు. ఉత్తమ వైద్యంతో మహానగరాలకు వెళ్లకుండానే ఇక్కడే అత్యుత్తమ వైద్యం అందించి ఎంతోమంది ప్రాణాలను కాపాడారని కొనియాడారు. మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో ప్రముఖ విద్యావేత్త అంగిరేకుల నాగార్జున, కొల్లు మధుసూదన్ రావు, పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ గంట దయాకర్ రెడ్డి, రంగారెడ్డి, చౌదరి, విజయ్ కుమార్, ఎస్వి కళాశాల మాజీ ప్రిన్సిపల్ విశ్వనాథం, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

తిరుమలగిరి (తుంగతుర్తి) : రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు కుంభం సతీష్‌గౌడ్ తెలిపారు. సోమవారం వెలిశాల గ్రామంలోని ముత్యాలమ్మ చెరువులో ఆయన చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మొగిలి రాజు, కృష్ణ, సోమయ్య, ప్రసాద్, ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమిరెడ్డి, వీరారెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకన్న, శంకర్ తదితరులు పాల్గొన్నారు.సొసైటీ సభ్యులు



వెలిశాలలోని ముత్యాలమ్మ చెరువులో చేప పిల్లలు వదులుతున్న నాయకులు,

వర్షానికి నేలకొరిగిన వరి చేలు

అర్వపల్లి: వానాకాలం సీజన్‌కు సంబంధించి వరిపొలాలు కోతకు వచ్చాయి. అయితే ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి కోతకు వచ్చిన వరి పొలాలు నేలకొరిగాయి. దీంతో తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అర్హతకు మించి మాట్లాడడం సరికాదు

పెన్‌పహాడ్ : మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వేణారెడ్డిలను విమర్శించే అర్హత లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సూర్యాపేటలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిల ఫొటోలు పెట్టడంపై బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు దొంగరి యుగేందర్ అనుచిత వ్యాఖ్యలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. అధినాయకత్వం జోలికి వస్తే ఊరికునేంది లేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పిన్నాని కోటేశ్వరరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అర్తి కేశవులు, మిడిమేలపు దామోదర్‌రెడ్డి, కొండేటి భిక్షంరెడ్డి, నారాయణ ప్రవీణ్‌రెడ్డి, జానివయ్య, సందీప్‌రాథోడ్, సైదులు. నకిరేకంటి వెంకన్న, శివనాయక్, దుబ్బా, జామ, శెనగాని రాంబాబు, నాగరాజు, మల్లేపల్లి వెంకన్న, సద్దల నగేష్, శ్రీను, సయ్యద్, నవీన్, శ్రీనివాసరెడ్డి, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు, నాయకులు

గంజాయి రహిత సమాజం కోసం బైక్ యాత్ర



మోతెలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు

మోతె : డ్రగ్స్, గంజాయి రహిత సమాజం కోసం మద్దిరాల మండలం గోరంట్ల గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ నిర్వహిస్తున్న జన చైతన్య బైక్ యాత్ర సోమవారం మోతె మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన గంజాయి, డ్రగ్స్‌తో కలిసి అనర్థాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల నివారణకు ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా పోరాడాలని ఆయన కోరారు.

తెలంగాణలో అగ్రవర్ణాల కుట్రలు సాగనివ్వం

● తెలంగాణ రాజ్యాధికార పార్టీ ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్

సూర్యాపేట : తెలంగాణలో అగ్రవర్ణాల కుట్రలు ఇక సాగనివ్వబోమని తెలంగాణ రాజ్యాధికార పార్టీ ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్యయాదవ్ స్పష్టం చేశారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ ప్రధాన కార్యదర్శిగా వట్టె జానయ్యను ప్రకటించిన తర్వాత సోమవారం మొదటిసారి తన సొంత నియోజకవర్గ కేంద్రమైన సూర్యాపేటకు వచ్చిన సందర్భంగా ఘనంగా స్వాగతం పలికారు. సూర్యాపేటలో భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణ ఏర్పడితే తమ బతుకులు బాగుపడతాయని ఎంతోమంది ఆత్మబలిదానాలు చేసుకొని ప్రత్యేక రాష్ట్రంసాధించి దొర చేతికి అప్పగిస్తే ధనిక రాష్ట్రాన్ని దరిద్రంగా మార్చారని ధ్వజమెత్తారు. బీసీలకు ప్రత్యేక పార్టీ వస్తేనే బతుకులు బాగుపడతాయని ప్రశ్నించే తీన్మార్ మల్లన్న పై వందల కేసులు పెట్టినా భయపడకుండా నేడు తెలంగాణ రాజ్యాధికార పార్టీని స్థాపించారన్నారు. 95శాతం ఉన్న బీసీలు ఎవరికి వేస్తున్నామనేది ఆలోచన చేయాలన్నారు. అగ్రవర్ణాల వాళ్లను ప్రశ్నిస్తే హత్యలు కేసులు పెట్టి ప్రాంతాల్లో లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో బీసీలకు జరుగుతున్న అన్యాయంపై బీసీలు ఏకమవుతున్నామని తెలిసి పార్టీ ప్రకటన చేయకుండా కుట్రలు పన్నారని, ఫ్లెక్సీలు చించి బెదిరింపులకు పాల్పడ్డారని మండిపడ్డారు. సూర్యాపేటలో ర్యాలీ అనగానే 33 యాక్ట్ తెచ్చి ఇబ్బందులు పెట్టే ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ ను అమలు చేస్తామని చెప్పి మోసం చేసినందుకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. అగ్రవర్ణాల నాయకులకు ఇదే చివరి ఎన్నికలని బీసీ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం కేతేపల్లి మండల పరిధిలోని చీకటిగూడెం మాజీ సర్పంచ్ కోట వెంకటేశ్వర్లు, కోట పూర్ణ చంద్రయ్య,చిముట ఉపేందర్ యాదవ్, వెంపటి రమేష్, కుంచం అంజి, కీసరి నాగరాజు, కోట వీరయ్య, గోపయ్య, మూతినేని శ్రీనివాస్ తదితరులు వట్టె జానయ్య యాదవ్ సమక్షంలో పార్టీలో జాయిన్ అయ్యారు. ఈ కార్యక్రమంలో వట్టె రేణుక, అన్నేపర్తి రాజేష్, కుంభం నాగరాజు, లింగస్వామి గౌడ్, కుంభం వెంకన్న, వల్లలా సైదులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో మాట్లాడుతున్న వట్టె జానయ్య



ర్యాలీలో పాల్గొన్న ప్రజలు